జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

ఆదివారం | 2-2-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 235 పేజీలు: 4 వెల : రూ.7


# మెడికోలకు.. భద్రత ఏదీ?

* ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సమస్యలు తిష్ట * మరుగుదొడ్లు, గదుల్లోకి పాములు * వైద్య విద్యార్థులు తినే ఆహారంలో పురుగులు * సమస్యలపై నిలదీస్తే ఫెయిల్ చేస్తామని బెదిరింపులు * సెక్యూరిటీ డిపాజిట్‌పై అనుమానాలు









**శ్రీకాకుళం క్రైం, ఫిబ్రవరి1 (వార్త):** శ్రీకాకుళం జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు చెందిన విద్యార్థులు వైద్యవిద్యను అభ్యసిస్తున్నారు. హాస్టల్స్‌లో కనీస వసతులు లేకపోవడంతో విద్యార్థులు నానాఇబ్బందులు పడుతున్నారు. మరుగు దొడ్లు బేసిన్లు పాడవ్వగా, మరికొన్నిచోట్ల టెయిల్స్ పగిలిపోయి ఉన్నాయి. తలుపులు సక్రమంగా లేవు. కిటికీల నుంచి పాములు, ఎలుకలు, క్రిమికీటకాలు వస్తుండడంతో మెడికోలు భయాందోళనకు గురవుతున్నారు. నీటి సరఫరా కూడా సక్రమంగా ఉండడం లేదు. హాస్టల్స్‌లో గదులు తక్కువగా ఉండడంతో మెడికోలు తప్పనిసరి పరిస్థితుల్లో ఉండాల్సివస్తోంది. భోజనశాలలో ఇచ్చే ఆహారంలో కొన్నిసార్లు పురుగులు కూడా కనిపిస్తున్నాయని ఆందోళన చెందుతున్నారు. నలుగురికి చెప్పే స్థానంలో ఉండే వైద్య విద్యార్థులు, వారే దిక్కులేని పరిస్థితుల్లో ఉండడం బాధాకరం. హాస్టల్స్ వద్ద సరైన భద్రత లేకపోవడంతో విద్యార్థులు రాత్రి వేళల్లో భయపడుతున్నారు. మెడికల్ కళాశాలలో సమస్యలను అనేకసార్లు మెడికోలు ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్, ఆర్ఎంవోలకు ఫిర్యాదులు చేసినప్పటికీ, ఏ ఒక్క సమస్యకు కూడా పరిష్కారం లభించడం లేదు. ఎవరైనా నిలదీస్తే యాజమాన్యం దురుసుగా ప్రవర్తిస్తోందని, కొత్త క్యాంపస్ వస్తుంది అందులో అన్నీ ఉంటాయని చెబుతూ కాలయాపన చేస్తున్నారని పలువురు మెడికోలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మెడికల్ కళాశాలలోని సమస్యలు బయటకు చెబితే ఎక్కడ ఫెయిల్ చేస్తారోనని వారు భయపడుతున్నారు. రిమ్స్‌లో కూడా డ్యూటీ డాక్టర్ల కోసం ప్రత్యేక రూములు, మరుగుదొడ్లు అందుబాటులో లేవు. అర్ధరాత్రి వేళలో డ్యూటీలో ఉన్న జూనియర్ మహిళా డాక్టర్లు మరుగుదొడ్లు ఉపయోగించేందుకు దూరంగా వెళ్లాల్సి వస్తోంది, ఇది వారి భద్రతకు ప్రమాదకరంగా మారుతోంది.

## సెక్యూరిటీ డిపాజిట్ ఏమౌతోంది..

యూజీ సీట్లను 150 నుండి 200కి, ఎండీ, ఎంఎస్ సీట్లు పెంచారే తప్ప అందుకుతగ్గ సదుపాయాలను సమకూర్చకపోవడం పట్ల మెడికోల నుంచి వ్యతిరేకత రోజురోజుకూ అధికమవుతోంది. హాస్టల్‌లో చేరే సమయంలో సెక్యూరిటీ డిపాజిట్ తీసుకుంటారు, కానీ పూర్తయ్యాక ఆ డిపాజిట్ తిరిగి ఇవ్వడం లేదు. నెలవారీ చార్జీలు వసూలు చేస్తూ, కనీసం తాగునీటి సదుపాయం కూడా అందించడం లేదు. విద్యార్థులు బయట నుంచి వాటర్ బాటిల్లు కొనుగోలు చేసుకుని తాగుతున్నారు. ఆ నిధులు ఏమవుతున్నాయో ఆ పెరుమాళుకే ఎరుక. రాష్ట్ర వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడుతో పాటు కలెక్టర్ స్పందించి మెడికల్ కళాశాలలో సమస్యలపై దృష్టి సారించాలని మెడికోలు కోరుతున్నారు.

# రక్షణ కల్పించండి





* మహిళా కళాశాల ఎదుట విద్యార్థినుల ధర్నా* నిందితులను శిక్షిస్తాం: ఎమ్మెల్యే గొండు* సమస్యలు ఉంటే నేరుగా చెప్పండి: ఎస్పీ మహేశ్వరరెడ్డి



**శ్రీకాకుళం, ఫిబ్రవరి 1 (వార్త):** తమకు రక్షణ కల్పించాలని కోరుతూ విద్యార్థినులు ప్రభుత్వ మహిళా కళాశాల ఎదుట ప్లకార్డులతో ధర్నా చేశారు. నగరంలోని బీసీ వసతి గృహంలో విద్యార్థినిపై జరిగిన దాడి ఘటన నేపథ్యంలో శనివారం మహిళా కళాశాల ఎదురుగా కళాశాల విద్యార్థినులు ఆందోళనబాట పట్టారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గొండు శంకర్ అక్కడికి వచ్చి విద్యార్థినులతో మాట్లాడారు. నిందితులను కఠినంగా శిక్షిస్తామని, విద్యార్థినులకు కావాల్సిన వసతులు, సౌకర్యాలపై చర్చిస్తామన్నారు. ధర్నా విరమించి వసతిగృహానికి వెళ్లాలని సూచించారు. ఎమ్మెల్యే నచ్చజెప్పినా విద్యార్థులు వినకుండా కలెక్టరేట్ వరకు ర్యాలీ చేశారు. దీంతో ఎమ్మెల్యే కళాశాల ప్రిన్సిపాల్ సూర్యచంద్రరావు, వార్డెన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరి అనుమతితో విద్యార్థినులు ధర్నా చేశారని, వారి కేమైనా జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని నిలదీశారు.

## సమస్యలు ఉంటే.. నా నంబరుకే 6309990800 ఫోన్ చేయండి:ఎస్పీ

విద్యార్థినులకు ఏమైనా సమస్యలు ఉంటే నిర్భయంగా నా నంబరు 6309990800కే ఫోన్ చేయాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి సూచించారు. శనివారం శ్రీకాకుళం పట్టణంలో మహిళా కళాశాలలో విద్యార్థినులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో సాంకేతిక పరిజ్ఞానం వల్ల ఎంత ఉపయోగం ఉన్నదో, అంతే నష్టం ఉందన్నారు. సెల్ ఫోన్లు అవసరం మేరకే వినియోగించాలని కోరారు. సమస్యలు ఉంటే స్నేహితులు, తల్లిదండ్రులకు చెప్పడంతో వాటి నుంచి కొంత మేరకు బయటపడవచ్చన్నారు. చదువుతున్న అమ్మాయిలు చెడు అలవాట్లకు, చెడు స్నేహానికి స్వస్తి పలకాలని కోరారు. సమాజంలో కొన్ని కట్టుబాటులు ఉంటాయని వాటికి అనుగుణంగా ప్రతి ఒక్కరు బాధ్యతగా ఉండాలని కోరారు. ప్రజలకు ఎల్లప్పుడూ జిల్లా పోలీసు శాఖ అందుబాటులో ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ సీహెచ్ వివేకానంద్, కళాశాల ప్రిన్సిపాల్ కె.సూర్యచంద్రరావు, అధ్యాపకులు, హాస్టల్ వార్డెన్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## సూర్యోదయలో రేపు సామూహిక అక్షరాభ్యాసం



**మందస, ఫిబ్రవరి 1(వార్త):** మందస అగ్రహారం వీధిలో గల సూర్యోదయ స్కూల్లో ఈ నెల మూడున సామూహిక అక్షర్యాభ్యాసం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు డైరక్టర్ మోణింగి నాగేశ్వరరావు, ప్రిన్సిపల్ పి.లోకేశ్వరరావు చెప్పారు. శ్రీపంచమి(సిరిపంచమి) సందర్భంగా నిర్వహించే ఈ కార్యక్రమాన్ని చిన్నారులు తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముందుగా పేరు నమోదు చేసుకున్న వారికి ఈ అకడమిక్ సంవత్సరంలో ఫీజు తీసుకోబడదని తెలిపారు. చిన్నారులకు పలక, బలపం, నోటు పుస్తకాలు అందివ్వబడతాయన్నారు. పూజా సామానులు తల్లిదండ్రులు తెచ్చుకోవాలని సూచించారు. చిన్నారులకు బంగారు భవిష్యత్ అందించే సూర్యోదయ స్కూల్లో జరిగే సామూహిక అక్షరాభ్యాసం కోసం మరిన్ని వివరాలకు 8919141746, 9959229667, 9989210357 అనే ఫోన్ నంబర్లకు సంప్రదించాలని వారు కోరారు.

# అనుమానంతో.. కడతేర్చాడు

**-నిందితుడు జాన్ అరెస్టు -కాశీబుగ్గ డీఎస్పీ వెంకటఅప్పారావు -మీడియా ముందుకు నిందితుడు**



**పలాస, ఫిబ్రవరి 1 (వార్త):** తన భార్యతో అక్రమ సంబంధం కలిగివున్నాడన్న నెపంతోనే సవర జాన్ స్నేహితుడు అమిటి శ్రీనును హత్య చేశాడని కాశీబుగ్గ డీఎస్పీ ఎం.వెంకట అప్పారావు తెలిపారు. శనివారం కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్‌లో మీడియా సమావేశంలో నిందితుడు జాన్‌ను ప్రవేశపెట్టారు. అనంతరం డీఎస్పీ మీడియాకు ఈ హత్యకు సంబంధించిన వివరాలు అందించారు. సవర జాన్, అమిటి శ్రీనులు కాశీబుగ్గ ఇండస్ట్రియల్ ఏరియాలో గల ఒక జీడిపిక్కల ఫ్యాక్టరీలో పనిచేస్తుండేవారు. శ్రీను పలుమార్లు జాన్ ఇంటికి తరచూ వెళుతుండేవాడు. ఈ క్రమంలో తన భార్యతో శ్రీను సన్నిహిత్యంతో మెలగడంతో అక్రమ సంబంధం పెట్టుకున్నాడని జాన్ అనుమానం పెట్టుకున్నాడు. ఎలాగైనా శ్రీనును చంపాలని భావించాడు. గత నెల 21న సాయంత్రం మూడు గంటల సమయంలో శ్రీను ఇంటికి జాన్ వెళ్లాడు. ఇద్దరూ కోసంగిపురం వెళ్లి సారా తాగారు. తిరిగి కాశీబుగ్గ వెళుతుండగా సబ్‌స్టేషన్‌సమీపంలోని జగనన్న కాలనీ వద్ద ఐరన్ రాడ్‌తో శ్రీను తలపై మోదాడు. దీంతో శ్రీను అక్కడికక్కడే చనిపోయాడు. ఆ తర్వాత ఏమీ తెలియనట్టు జాన్ వచ్చేశాడు. శ్రీను భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తన కోసం గాలిస్తున్నట్టు తెలుసుకున్న జాన్ కోసంగిపురం పంచాయతీ కార్యదర్శి వద్ద శ్రీనును తానే హత్య చేసినట్టు చెప్పాడు. పంచాయతీకార్యదర్శి ఆధ్వర్యంలో జాన్ పోలీసులకు లొంగిపోయాడని తెలిపారు. సమావేశంలో సీఐ పి.సూర్యనారాయణ, హెచ్‌సీ శ్రీను ఉన్నారు.

# విద్యా, ఉపాధ్యాయ సమస్యల పరిష్కార వారధి రఘువర్మ

**-ఏపీటీయఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు భీమారావు**



**మందస, ఫిబ్రవరి 1(వార్త):** విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేసే అతి సాధారణ వ్యక్తి పాకలపాటి రఘువర్మ అని ఏపీటీయఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు గవ్వ భీమారావు తెలిపారు. ఆయన తన జీవితాన్ని, జీతాన్ని పేద విద్యార్థుల సంక్షేమం, విద్యారంగ పరిరక్షణ ఉపాధ్యాయులు సమస్యల పరిష్కారానికి త్యాగం చేశారన్నారు. ఉపాధ్యాయులు కి ఏ కష్టం వచ్చినా వెంటనే స్పందిస్తూ, ఉపాధ్యాయ వాణిని శాసనమండలిలో వినిపించే వ్యక్తి అయిన ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రఘువర్మ గారిని మరోసారి శాసనమండలికి అవసరం ఎంతైనా ఉందని అన్నారు. కరోనా కష్టకాలంలో అసువులు బాసిన ఉపాధ్యాయ కుటుంబాలను పరామర్శించి, వారిని ఓదారుస్తూ... వారికి ప్రభుత్వం రావాల్సిన బెనిఫిట్స్ త్వరతగతిన మంజూరు అయ్యేవిధంగా చేస్తూ, వారి కుటుంబ సభ్యులకి రావాల్సిన కారుణ్య నియామకాలు గూర్చి కృషి చేసారు. ఈ సందర్బంగా అయన గెలుపు కొరకు ఏ పీ టీ యఫ్ మందస నాయకులు గత 10 రోజులుగా పాఠశాల పనివేళల అనంతరం ఉపాధ్యాయ %మీజ% ఓటర్లు ఇంటికి వెళ్లి, ఇంటింట ప్రచారం చేస్తూ ఈ నెల 27 న జరిగే ఎన్నికల్లో ఆయనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు. ఇటీవల కాలంలో అయన అభ్యర్థిత్వానికి ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయులు సంఘం కూడా మద్దతు తెలిపిందని, ఇతర మిత్ర సంఘాలు కూడా ఆయన నాయకత్వాన్ని కోరుకుంటున్నాయని వారు ఒక ప్రకటనలో తెలిపారు. అదే విధంగా ఈ నెల 4వ తేదీన విశాఖపట్నం లో అతను నామినేషన్ వేయనున్నారు అని, సదరు కార్యక్రమం లో అధిక సంఖ్యలో కార్యకర్తలు మరియు ఉపాధ్యాయులు పాల్గొనాలని ఏ పీ టీ యఫ్ మందస నాయకులు తెలిపారు. గత 10 రోజులుగా మందస మండలంలోని మందస, హరిపురం, బాలిగాం, డబారు, జిల్లుండ, కొత్తపల్లి, సొండిపూడి, మూలిపాడు, కుంటికోట, మాఖరజోల, జిల్లుండ, బెల్లుపటియా, సిరిపురం, పొత్తంగి తదితర గ్రామాల్లో కొనసాగుతున్న ఈ ప్రచార కార్యక్రమం లో ఏ పీ టీ యఫ్ మందస అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యస్. కిరణ్ కుమార్, కె. సుందర రావు, సీనియర్ కార్యకర్త వి. వి. వరప్రసాద్, ఇతర కార్యవర్గ సభ్యులు డి. వైకుంఠ రావు, యస్. కరుణాకర్, బి. తిరుపతి రావు, డి. చంద్రశేఖర్, యస్. ఢిల్లేశ్వర రావు, యస్ గణేశ్వర రావు, యస్ నారాయణరావు, యస్ జగన్నాధరావు, బి. మురళీ మోహన్, బి. బైరాగి, డి. మోహన రావు, డి. రామారావు, యం. చిత్రసేను, యస్ సూర్యారావు, జీ. వసంత్, బి.శివ, డి.వేణుగోపాల్ మరియు బి. రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు పనులను వేగవంతం చేయాలి



**సీతంపేట, ఫిబ్రవరి 1(వార్త):** పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా గిరిజన గ్రామాల్లో చేపడు తున్న రోడ్డు పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయుటకు చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ పీవో సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి అన్నారు. శనివారం గిరిజన సంక్షేమ శాఖ, పంచాయతీరాజ్ శాఖ ఇంజనీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా పీవో మాట్లాడుతూ పల్లె పండుగ కార్యక్రమం కింద మంజూరైన పనులను వెంటనే పూర్తి చేయాలని సూచించారు. పనుల్లో అలసత్వం ప్రదర్శించరాదని అన్నారు. పనుల్లో నాణ్యత లోపించకూడదని అన్నారు. పనుల ప్రారంభానికి ఏవైనా సాంకేతిక సమస్యలు ఎదురైతే వాటిని వెంటనే పరిష్కరించుకొని పనులు ప్రారంభించాలని సూచించారు. నెలాఖరు నాటికి అన్ని పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఈఈ రమాదేవి, పంచాయతీ రాజ్ ఈఈ రవి, డీఈలు సింహాచలం, రాధారాణి, లోకనాథం, ఏఈలు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

# రైల్వే సమస్యలపై జనసేన ఆధ్వర్యంలో రేపు ధర్నా



**ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 1(వార్త):** జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఇచ్ఛాపురంలో రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి కోసం జనసేన నాయకులు దాసరి రాజు అధ్యక్షతన ఈ నెల 3న నిరసన ప్రదర్శనలు చేపడుతున్నట్లు తెలిపారు. నిరసన కార్యక్రమానికి జనసేన పార్టీ కార్యాలయంలో కరపత్రాలు రిలీజ్ చేయడం జరిగినది. ఎన్నో ఏళ్లగా ఆంధ్ర ఒరిస్సా సరిహద్దు ఇచ్ఛాపురానికి అనుకొని పలు గ్రామాలకు వెళ్లే ప్రధాన మార్గంలో రైల్వే అండర్ బ్రిడ్జి కోసం ఎందరో రాజకీయ నాయకులకు రైల్వే అధికారులకు కలిసి వినతి పత్రాన్ని ఇచ్చిన ఫలితం లేదు. ఈ ఫిబ్రవరి 3వ తేదీ 2025 రైల్వే జీఎం వస్తున్న సందర్భంగా బాధిత గ్రామ ప్రజలందరూ పెద్ద ఎత్తున వచ్చి ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొని జీఎం కి నిరసన పత్రం అందించడం లో తమ వంతు బాధ్యతను చాటుకోవాల్సిందిగా పిలుపునిచ్చారు. స్థానికంగా ఉన్న ప్రైవేటు ప్రభుత్వ పాఠశాలలలో కాలేజీలలో ఆటో యూనియన్ లారీ యూనియన్ టాక్సీ యూనియన్ షాపు యూనియన్ ఇలా పలు రకాల యూనియన్లతో కలసి ఈ నిరసన కార్యక్రమానికి మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ తిప్పన దుర్యోధన రెడ్డి అధ్యక్షతన మున్సిపాలిటీ నాయకులు రొకళ్ల భాస్కరరావు, నాయకులు హేమాచలపతి, రుక్మధ రావు, కలియా గౌడ్ శ్యామ్, సుధాకర్, ప్రేమ్, అశోక్ లు పాల్గొన్నారు.



## ఉజ్జీవ మహాసభల్లో మాజీ ఎమ్మెల్యే ప్రత్యేక ప్రార్థనలు

**సీతంపేట, ఫిబ్రవరి 1(వార్త):** గజిలి గ్రామంలో నిర్వహించిన క్రిస్టియన్ ఉజ్జీవ మహాసభలుకు పాలకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి శనివారం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉజ్జీవ మహాసభల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రజలు అందరూ ఆరోగ్యంగా ఉండాలని కోరుకున్నట్లు కళావతి తెలిపారు. ఈ క్రమంలో నిర్వాహకులు ఆమెకు దుస్సాలువతో సత్కరించారు. వీరితో పాటు సీతంపేట మండల జడ్పీటీసీ ప్రతినిధి సవర రాము, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

## 5న జాబ్ మేళా



**సీతంపేట, ఫిబ్రవరి 1(వార్త):** ఐటీడీఏ ఆధ్వర్యంలో ఈనెల 5వ తేదీన సీతంపేట వైటీసీలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఐటీడీఏ పీవో సి. యశ్వంత్ కుమార్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉద్యోగాలకు పది, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ పూర్తి చేసిన 18 నుంచి 35 ఏళ్లలోపు గల యువతీ యువకులు అర్హులన్నారు. ఈ జాబ్ మేళాలో 6 కంపెనీలు పాల్గొంటాయని తెలిపారు. ఈ కంపెనీల్లో 400 ఉద్యోగాలకు అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు పీవో తెలిపారు.

## రథసప్తమికి రాగి లడ్డూలు, పులిహోర వితరణ



**సీతంపేట, ఫిబ్రవరి 1(వార్త):** పెదరామలో ఉన్న మన్యం సహజ వీడివికే సభ్యులు శ్రీకాకుళంలో జరగనున్న రథసప్తమి మహోత్సవ వేడుకలకు పదివేల రాగి లడ్డూలు, పులిహోర పొట్లాలను తయారు చేసి ప్రసాదంగా ఇస్తున్నారు. ఈ క్రమంలో వీటికి సంబంధించిన వాహనాన్ని సీతంపేటలో పిఓ సి. యశ్వంత్ కుమార్ రెడ్డి జెండా ఊపి శనివారం ప్రారంభించారు. ఐటీడీఏ పరిధిలోని వీడివికే సభ్యులు ఇటువంటి సేవా కార్యక్రమాలు చేయడం ఆదర్శనీయమన్నారు.

## ఆర్డీవో ఆదేశాలతో ఆక్రమణలు తొలగింపు



**సంతబొమ్మాళి, ఫిబ్రవరి 1(వార్త):** టెక్కలి ఆర్డిఓ కృష్ణమూర్తి ఆదేశాల మేరకు మండలంలో నౌపడ వైయస్సార్ కాలనీలో ఆక్రమణలను శనివారం రెవెన్యూ, పంచాయతీ, పోలీస్ సిబ్బంది తొలగించారు. జెసిపి సహాయంతో తుప్పలన్నిటిని తొలగించి చదును చేశారు. ఇది ప్రభుత్వ భూమి అని బోర్డును ఏర్పాటు చేసి, ఎవరు ఆక్రమణలు చేసిన చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో మంగులు పంచాయతీ కార్యదర్శి ఉమాపతి ఉన్నారు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## సకాలంలో ఉపాధి హామీ వేతనాలు చెల్లించాలి

**భామిని, ఫిబ్రవరి 1(వార్త):** భామిని మండలంలో ఉపాధి హామీ వేతనాలు సకాలంలో చెల్లించాలని ఉపాధి హామీ లబ్ధిదారులు డిమాండ్ చేస్తున్నారు. ఉపాధి హామీ వేతనాలు ఆలస్యం అవుతుండడంతో అవస్థలు పడుతున్నామని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్య పై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, అధికారులు స్పందించి, సకాలంలో వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఉపాధి హామీ లబ్ధిదారులు కోరుతున్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## పింఛన్లు పంపిణీ పరిశీలించిన ఎంపీడీవో



**వంగర, ఫిబ్రవరి 1(వార్త):** ఎం సీతారాంపురం, మద్దివలస గ్రామాల్లో జరుగుతున్న పింఛన్లు పంపిణీ కార్యక్రమాన్ని ఎంపీడీవో లోపింటి త్రినాధ రావు పరిశీలించారు. వంగర మండలంలోన అన్ని గ్రామాల్లో కూడా పింఛన్లు పంపిణీ వేగవంతం చేయాలని ఆదేశాలు జారీ చేశారు. శనివారం 94% పింఛన్లు పంపిణీ పూర్తి అయినట్లు తెలిసింది. మిగిలిన పింఛన్లు కూడా 3వ తేదీన పూర్తి చేయడం జరుగుతుంది.



## తిరుపతి రథసప్తమికి కోలాటం బృందం

**ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 1(వార్త):** హరిపురం గ్రామానికి చెందిన అసిరమ్మ తల్లి కోలాట బృందం ఈనెల నాలుగో తేదీన తిరుమల తిరుపతి దేవస్థానం తిరుపతిలో జరగబోయే రథసప్తమి సూర్యప్రభ వాహన వేడుకల్లో ప్రదర్శనకు అనుమతి లభించింది. 30 మందితో కోలాట బృందం ఈనెల రెండవ తేదీన బయల్దేరునున్నారు. అవకాశం లభించడం కోలాటం బృందం గురువు తిప్పన ధనుంజయ రెడ్డి తిరుమల తిరుపతి దేవస్థానం ప్రోగ్రాం ఆఫీసర్స్ కి ధన్యవాదాలు తెలియజేశారు. అసిరమ్మ తల్లి కోలాట బృందానికి మహతి సంస్కృతిక కళా సేవా సంస్థ అధ్యక్షులు మరియు కార్యవర్గం హర్షం వ్యక్తం చేస్తూ శుభాభినందనలు తెలియజేశారు.

## మధ్యతరగతి ఉద్యోగులకు భారీ ఊరట



**పలాస, ఫిబ్రవరి 1(వార్త):** కేంద్ర ప్రభుత్వం ఆర్థిక మంత్రి నిర్మల సీతారామ న్ ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ లో మధ్యతరగతి ఉద్యోగులకు ఆదాయపన్ను తగ్గింపు భారీ ఊరటనిచ్చిందిని రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ ఫార్మసీ ఆఫీసర్స్అసోసియేషన్అధ్యక్షులు, పలాస ఏపీఎన్జీవో నాయకులు బోనాల గోపాల్ పేర్కొన్నారు. కేంద్ర బడ్జెట్ శనివారం కేంద్రమంత్రి ప్రవేశ పెట్టడంతో స్పందించారు. దేశంలో 7.5 కోట్ల ఉద్యోగుల పన్ను తగ్గింపు ద్వారా లక్ష కోట్ల ఆదాయం ప్రభుత్వానికి గండి పడిందని, అయినప్పటికీ ఉద్యోగుల పన్ను తగ్గింపు హర్షనీయమని అన్నారు. తద్వారా పన్నులు కట్టేవారు శాతం పెరుగుతుందిని, అలాగే కొనుగోలు శాతం మరియు వస్తువు వినియాగం పెరిగి ప్రభుత్వ ఆదాయం పెరుగు తుందిని చెప్పారు. కార్పొరేట్ రాయితీలు బదులుగా మధ్యతరగతికి రాయితీల ద్వారా ప్రభుత్వ ఆదాయం పెరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, గతంలో ఆర్థిక నిపుణులు సూచన లు పాటించే విధంగా ఈ బడ్జెట్ ఉందన్నారు.

## వికసిత్ భారత్ ప్రతిబింబించేలా కేంద్ర బడ్జెట్



**పలాస, ఫిబ్రవరి 1(వార్త):** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ వికసిత్ భారత్కు ప్రతిబింబించేలా ఉందిని, మధ్యతరగతి టాక్స్ పేయర్లకు అనుకూలించే బడ్జెట్ అని ఆంధ్రప్రదేశ్ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వద్ద బాబురావు అభివర్ణించారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ బడ్జెట్ ప్రవేశపెట్టగా మన వరకు వస్తే పోలవరం వైజాగ్ స్టీల్ ప్లాంట్ వైజాగ్ పోర్టు అదనంగా ఏడు ఎయిర్పోర్టు మన రాష్ట్రం గుండా వెళ్లే జాతీయ రహదారి సిక్స్ లైన్స్ కు విస్తరించే కార్యక్రమం ఎక్కువగా చేపట్టడం వ్యవసాయానికి, తాగునీటికి ప్రాధాన్యత ఇవ్వడం పెట్టుబడులను ఆకర్షించడం కనిపిస్తుంది ప్రధాని నరేంద్ర మోడీకి, ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ కి కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడుకి మన రాష్ట్ర ఎంపీలకు ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు.

## ఘనంగా కుంకుమ పూజలు




**సంతబొమ్మాళి, ఫిబ్రవరి 1(వార్త):** నౌపడ గ్రామం లో నూతన భూలోకమ్మ తల్లి ఆలయ ప్రతిష్టలో భాగంగా రెండవ రోజు హోమం కార్యక్రమం, కుంకుమ పూజలు ఘనంగా నిర్వహించారు. గ్రామం లోని ప్రజలు పెద్దఎత్తున అమ్మ వారి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త దల్లి రాజు కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## కిటికీలకు తలుపులు వేయించండి

**వంగర, ఫిబ్రవరి 1(వార్త):** అరసాడ ప్రాథమిక పాఠశాలలో కిటికీలకు డోర్లు లేక పిల్లలు ఇబ్బంది పడుతున్నారని, చిన్న చిన్న పాములు, తేళ్లు కీటకాలు క్లాస్ రూమ్ లో చేరుతున్నాయని, దీంతో పిల్లలు భయాందోళన చెందుతున్నారని హెచ్ఎం గోవింద తెలిపారు. అధికారులు వెంటనే స్పందించి కిటికీలకి డోర్లు వేయాలని కోరారు.




# రైతుల పొట్ట కొడుతున్న అధికారులు

**-అక్రమంగా రహదారి నిర్మాణం**

**-జిరాయితీ భూములలో అక్రమాలు**

**-అడ్డుకున్న రైతులపై దౌర్జన్యం**

**-స్పందించని అధికారులు**

**-జిల్లా కలెక్టర్, ఎస్పీలకు ఫిర్యాదు**

**-న్యాయం చేయాలని రైతుల మొర**

(మందస)

రామాయణంలో ఓ కథను పెద్దలు చెబుతూ ఉంటారు. శ్రీరాముడు స్నానానికి వెళ్తూ.. ధనుస్సు, బాణాలను ఓ చోట ఉంచి, వెళ్లారట. బాణం ఓ కప్ప మీద ఉంచడంతో అది రాముడు తిరిగి వచ్చే వరకు విలవిల్లాడింది. తిరిగివచ్చిన రాముడు కప్ప బాధను చూసి, ఎంతో బాధ పడి.. నీవు పడుతున్న బాధను ఎందుకు చెప్పలేదనడంతో నాకు ఏ బాధ వచ్చినా శ్రీరామా అంటానని కప్ప చెప్పింది. ఆ శ్రీరాముడే బాధ కలిగిస్తే ఎవరికి నాబాధ చెప్పుకోను అంటూ బోరుమంది. సరిగ్గా ఇదే కష్టం మందస మండలంలోని భేతాళపురం గ్రామంలోని పేద రైతులకు వచ్చింది. తమ జిరాయితీ భూముల్లో అక్రమంగా రహదారి నిర్మాణం చేస్తున్నారని అధికారులు, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తే వారి స్పందించకపోవడంతో తమను రక్షించే దిక్కెవ్వరంటూ రోదిస్తున్నారు. కాపాడడానికి దివి నుంచి భువికి దేవుడే దిగిరావాలేమోనని బాధితులు పేర్కొంటున్నారు. ఓ వైపు కొంతమంది నాయకుల వేధింపులు, మరో పక్క కాపాడాల్సిన అధికారులే నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడంతో తమకు న్యాయమైనా కాపాడుతుందేమోనని కోరుతున్నారు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.

మందస మండలం భేతాళపురం గ్రామం పరిధిలో ఇటీవల రహదారి పనులు జరిగాయి. సముద్రం తీరానికి సుమారు రెండు కిలోమీటర్లు బీటీ రోడ్డు నిర్మాణ పనులు రైతుల జీడి కొబ్బరి జిరాయితీ భూముల మధ్య నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా అధికారులు, కాంట్రాక్టర్లు నిర్మాణం చేపడుతున్నారని ఇదే గ్రామానికి చెందిన గుంటు మాధవరావు, బైపల్లి పాంమ్మ, గుంటు అంకమ్మతో పాటు మరో ముగ్గురు రైతులు సుమారు ఆరు ఎకరాలు సర్వే నెంబర్ 57/2, 59/6లలో బీటీ రోడ్డు నిర్మాణం పనులు రైతులు అనుమతులు లేకుండా చేశారని బాధిత రైతులు ఆరోపిస్తున్నారు. రాత్రి, పగల్లేకుండా పంచాయితీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు, గుత్తేదారుడు రైతులు అనుమతులు లేకుండా బిటి రోడ్డు పనులు చేపట్టారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్, ఆర్డీఓ, తహసీల్దార్లకు ఫిర్యాదు చేసినట్టు రైతులు తెలిపారు. సర్వే నెంబర్ 57/2, 59/6 రైతుల జిరాయితీ భూములేనని రెవిన్యూ అధికారులు, సర్వేయర్ చెబుతున్నారని రైతులు చెప్పారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రభుత్వం రెవిన్యూ రికార్డ్ లు పరిశీలించి రైతుల మెట్టు, జిరాయితీ భూములుగా రికార్డ్, నకలు జారీ చేసారని తెలిపారు. రైతుల అనుమతులు లేకుండా, నష్ట పరిహారం చెల్లించకుండా కొందరి అండదండలతో దౌర్జన్యంగా బీటీ రోడ్డు నిర్మించారని జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేశామని రైతులు తెలిపారు.





ఈ విషయం పై జిల్లా కలెక్టర్, పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష రైతులకు న్యాయం చేయాలని వారు కోరారు. పీజీఆర్ఎస్లో తెలియజేయగా తహశీల్దార్, ఆర్డీఓ డివిజనల్ సర్వేయర్ సమక్షంలో జిరాయితీ భూమిగా నిర్ధారణ జరిగిందని రైతులు చెబుతున్నారు. అయినప్పటికీ కూడా రోడ్డు పని ఆపకుండా దౌర్జన్య నిర్మాణం చేసిన కాంట్రాక్టర్, పంచాయితీ రాజ్ ఇంజనీరింగ్ అధికారులు, ఇతర అధికారుల నిర్లక్ష్యం కళ్ళారా చూసిన రైతులు న్యాయస్థానాన్ని ఆశ్రయించామన్నారు. ఈలోగా పంచాయితీ రాజ్ ఇంజనీరింగ్ అధికారులు తమకు ఏమీ పట్టనట్టుగా బిల్లులు చేయడం జరుగుతోందన్నారు. ఇదే విషయమై రైతులు ప్రభుత్వ భూములపై నిర్మాణాలు చేపడితే ప్రభుత్వం వదిలేస్తుందా ప్రశ్నించారు. ఇష్టానుసారంగా త్రవ్వకాలు చేపడుతున్నారని అడిగితే దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని, ఇదేనా ప్రజాస్వామ్యమని ఆవేదన వ్యక్తం చేశారు. సామాన్య రైతులు తమ భూమి కూడా కాపాడుకునే హక్కు లేదన్నట్లుగా అధికారులు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. న్యాయం జరగక కోర్టు ను ఆశ్రయించినట్టు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు ప్రజాప్రతినిధులు రైతులకు న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.

# చిత్తడి నేలలు నీటి నాణ్యతను కాపాడుతాయి

**పలాస, ఫిబ్రవరి 1(వార్త):** పలాస మండలంలోని బ్రాహ్మణతర్లా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం జాతీయ హరితదళ క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవం నిర్వహించారు. చిత్తడి నేలల ఆవశ్యకతపై గ్రామంలో అవగాహన ర్యాలీ చేసారు. అనంతరం ఈ అంశం పైన విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు పెట్టి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఏడాది పొడవునా నీటితోనిండి ఉండే ప్రాంతాలను చిత్తడి ప్రాంతాలు అంటారు. చిత్తడి నేలలు – ప్రకృతి నిధి ఇవి జీవవైవిధ్యానికి నిలయం, వరదలను నియంత్రిస్తాయి, నీటి నాణ్యతను కాపాడుతాయని, వాతావరణ మార్పులతో పోరాడటంలో కీలక పాత్ర పోషిస్తాయి. అటువంటి చిత్తడి నేలలను కలుషితం చేయకుండా జాగ్రత్త పడడం, కాపాడుకోవడం మనందరి బాధ్యతని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్వీ. రమణారావు, ఎన్జీసీ క్లస్టర్ కోఆర్డినేటర్ కొయ్యల శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు ఈశ్వర రావు, రమేష్, , సుధాకుమారి, పద్మలోచనం, జనార్ధన రావు, పద్మ, చంద్రశేఖర్, శివప్రసాద్, కిషోర్, రజని కుమారి, జ్యోతమ్మ, అరుణకుమారి, క్రిష్ణవేణి, చిన్నారావు, లక్ష్మి భాయి, విష్ణాచారి, మధుసూదన్, రవితేజ, కోటేశ్వరరావు, తులసీరాణి తదితరులు పాల్గొన్నారు.




# విపరీతమైన పొగ మంచుతో జీడి, మామిడికి తీవ్ర నష్టం



**వంగర, ఫిబ్రవరి 1(వార్త):** గత వారం రోజులు గా వాతావరణంలో ఒక్కసారిగా మార్పు చోటు చేసుకుంది. వాతావరణం అంతా దట్టమైన పొగమంచు తో అలుముకుంటోంది. దీంతో జీడి,మామిడి పంటలకు తీవ్ర నష్టానికి గురవుతున్నట్లు రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా వారం రోజులుగా వేకువున 4 గంటల నుండి మంచు పూర్తిగా అలముకుంటోంది కనీసం ఉదయం తొమ్మిది గంటల కు కూడా సూర్యుడు కనిపించక పోవటం,అంతే కాకుండా రోడ్డు మీద వెళున్న వాహనదారులు,జనాలు కనిపించని వి ధంగా తయారై ప్రయాణీకులు, ప్రజలు ఇబ్బందు లకు గురవుతున్నారు. అటుజీడి,మామిడి, ఎన్నో రకాలు వల్ల చిరు పంటలు నష్టాలకు గురికాక తప్పదని రైతులు ఆందోళన చెందుతున్నారు. రోడ్లమీద ప్రయాణించే వాహన దారులు రోడ్డు కనబడక ఇబ్బంది పడగా జీడి మామిడి పంట వరుసగా నష్టాలు చవిచూస్తోంది. దీంతో రైతాంగం లబోదిబోమం టున్నారు. గతేడాది గిట్టుబాటు ధర లేక జీడిమామిడి రైతులు నష్టాలను చవిచూశారు. ఈ ఏడాది వాతావరణ ప్రభావంతో మంచు ఎక్కువగా పడి జీడి, మామిడి పూత మాడిపోతుంది. దీంతో రైతు ఆశలను ఆడియాశలు చేస్తుంది. ప్రతి ఏటా ఏదో రూపంలో జీడి మామిడి రైతులు నష్టపోతూనే ఉన్నారు. ఈ ఏడాది జీడిమామిడి రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. ప్రతి ఏటా నష్టాల పాలవుతున్న జీడిమామిడి రైతులను ఆదుకోవాలని ఈ ప్రాంత రైతులు కోరుతున్నారు.

# ఇతరులకు సహాయం చేయండి

**పలాస, ఫిబ్రవరి 1(వార్త):** భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారు తన అవతార దివ్య సందేశాలలో ఎల్లప్పుడూ ముఖ్యంగా అందరిని సేవించు–అందరిని ప్రేమించుని చెబుతూ, ప్రతీవారు వారి వారి రోజువారీ ఖర్చులు తగ్గించుకొని తద్వారా పొదుపు చేసిన మొత్తంతో, సమాజానికి సేవలు చేయమని శ్రీ సత్య సాయి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ చైర్మన్ మల్లా రామేశ్వరం దివ్య సందేశాన్ని ఇచ్చేరు. తదనుగుణంగా శ్రీ సత్యసాయి విద్యావిహార్ రామకృష్ణాపురము విద్యార్థి విద్యార్థులు, గత 9 సం!!ల నుండి, వాళ్ళ వాళ్ళ పాకెట్ మనీలో కొంత మిగిల్చికొంటూ, తద్వారా మిగిలిన మొత్తంతో ప్రతీనెల 1 తారీఖున నారాయణసేవ చేస్తున్నారు. దాంట్లో భాగంగా శనివారం ఒకటవ తేదీ సందర్భంగా, స్థానిక రైల్వేస్టేషన్ వద్ద ఉన్న నారాయణలకు ఆహార ప్రసాదం స్వామివారి విభూతి, స్వామివారి చిత్ర పఠాన్ని, విద్యార్థులు, ఉపాధ్యాయులు నారాయణసేవా ఇంఛార్చ్ దాలేటిలు అందజేశారు.



## ఆశ్రమవాసులకు దుప్పట్ల పంపిణీ

**హిరమండలం, ఫిబ్రవరి1(వార్త):** హిరమండలం మేజర్ పంచాయతీ పెద్దకోరాడ భరత్‌నగర్ ప్రేమసాయి వృద్ధా శ్రమంలో ఆశ్రయం పొందుతున్నవారికి శని వారం దుప్పట్లు అందజేశారు. వృద్ధాశ్రమం లో కొత్తూరు మండలం నివగాం గ్రామవాసి గొడబ రామయ్య జ్ఞాపకార్థం కుమారుడు సింహాచలం, బుజ్జి దంపతులు ఆశ్రమవా సులకు దుప్పట్లతోపాటు భోజనాన్ని అందజే శారు. ఈ మేరకు వృద్ధాశ్రమ మేనేజర్ కెంగువ జయరాం మాట్లాడుతూ, ప్రేమసా యి వృద్ధాశ్రమాభివృద్ధికి ప్రతిఒక్కరూ కృషి చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఈయ నతోపాటు ఆశ్రమవాసులు కోరాడ నర్సిం హమూర్తి తదితరులున్నారు.



## మహా కుంభమేళాకు ఆర్టీసీ ప్రత్యేక బస్ సర్వీసులు

**టెక్కలి, ఫిబ్రవరి1 (వార్త):** ఉత్తరప్రదేశ్ లో జరుగు చున్న మహా కుంభమేళాకు (ప్రయాగ్ రాజ్) టెక్కలి, పలాస డిపోలలో నుండి కొత్త సూపర్ లగ్జరీ బస్సులతో ప్రత్యేక బస్ సర్వీసులను నడుపనున్నట్లు టెక్కలి డిపో మేనేజర్ ఎన్.శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బస్సులు ఈనెల 12వ తేదీ సాయంత్రం 3 గంటలకు బయలుదేరి నేరుగా ప్రయాగరాజ్ చేరుకొని, అచ్చట దర్శనం చేసుకుని తిరుగు ప్రయాణంలో త్రివేణి సంగమం, కాశీ విశ్వేశ్వర స్వామి జ్యోతి ర్లింగం, కాశీ అన్నపూర్ణ, కాశీ విశాలాక్షి, బుద్ధుడు జ్ఞానోదయం పొందిన మహాభోధి ఆలయం, శ్రీ విష్ణు పాద ఆలయం, శ్రీ మంగళ గౌరీ శక్తిపీఠం, కోణార్క్ సూర్య నారాయణ స్వామి దేవాలయం, పూరి జగన్నాథ స్వామి దేవాలయం, భువనేశ్వర్ లింగరాజు స్వామి దేవాలయం లను దర్శనం చేసుకుని ఏడో రోజు సాయంకాలం టెక్కలి చేరుకోనున్నట్లు తెలిపారు. అల్పా హారం, భోజనంతో కలిపి మనిషి ఒక్కంటికి రానుపోను రూ.9500గా టిక్కెట్ వసూల్ చేయనున్నట్లు తెలి పారు. వివరాలకు ఫోన్ 9959225611, 73829 23311,7382923507 నంబర్లకు సంప్ర దించ గలరని కోరారు.

## మార్చి 3 నుంచి ఓపెన్ స్కూల్ ఇంటర్మీడియట్ పరీక్షలు

**శ్రీకాకుళం, ఫిబ్రవరి1(వార్త):** ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యా పీఠం (ఓపెన్ స్కూల్) ఇంటర్మీడియట్ పరీక్షలు మార్చి మూడవ తేదీ నుంచి మార్చి 15 వరకు జరుగుతాయని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్. తిరుమల చైతన్య ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలు ఆయా తేదీలలో ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతాయి. మార్చి 3న ఇంగ్లీష్, 5న తెలుగు, ఉర్దూ, హిందీ, 7న రసాయన శాస్త్రం, ఆర్థిక శాస్త్రం, సామాజిక శాస్త్రం, 10న భౌతిక శాస్త్రం, రాజనీతి శాస్త్రం / పౌర శాస్త్రం, మనోవిజ్ఞాన శాస్త్రం, 12న గణి తం, చరిత్ర, వ్యాపార గణాంక శాస్త్రం, 15న జీవ శాస్త్రం, వాణిజ్య వ్యాపార శాస్త్రం, గృహ విజ్ఞాన శాస్త్రం పరీక్షలు ఉంటాయని డీఈవో తెలిపారు.

## రథసప్తమి రాష్ట్ర పండుగ కావడం జిల్లా ప్రజల అదృష్టం

**శ్రీకాకుళం, ఫిబ్రవరి 1(వార్త):** దేశంలోనే ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అరసవిల్లి సూర్యనారాయణ స్వామి రథసప్తమి వేడుకలను రాష్ట్ర పండుగ ప్రభుత్వం గుర్తించడం జిల్లా ప్రజల అదృష్టమని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. అరసవిల్లి సూర్యనారాయణ స్వామి దేవాలయంలో ఎమ్మెల్యే శంకర్ విలేకరులతో శనివారం మాట్లాడారు. సామాన్య భక్తులు సైతం స్వామి వారిని సులువుగా దర్శించుకునేలా అన్ని ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. గతంలో సుమారు 5 కిలోమీటర్లు నడకదారిలో వెళ్లి స్వామి వారిని దర్శించుకునేందుకు అవస్థలు పడే వారిని, ప్రస్తుతం 500 కమీటర్లు నడిస్తే చాలు దర్శనం అయ్యేలా ఏర్పాట్లు చేసినట్టు చెప్పారు. కొన్ని వైపులా 200 మీటర్ల నుంచి కూడా స్వామివారిని దర్శించుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఈ ఏడాది సుమారు లక్ష మందికి పైగా భక్తులు స్వామివారిని దర్శించుకునే అవకాశం ఉందని వెల్లడించారు. ఆలయానికి మూడు వైపులా పార్కింగ్ ఏర్పాట్లు చేశామని రూ. 100 టికెట్లు, ఫ్రీ దర్శనం కూడా సులువుగా ఉండేలా చేసామన్నారు. ఒకవైపు 500 రూపాయలు టికెట్లు డోనర్ పాసులు కూడా ఏర్పాటు చేసినట్లు వివరించారు. లోపలికి వెళ్లేసరికి ఫ్రీ దర్శనం భక్తులను దృష్టిలో ఉంచుకొని రెండు లైన్లు పెట్టామన్నారు. భక్తుల తాడుకుడిని దృష్టిలో ఉంచుకొని 200 బయో టాయిలెట్లు ఏర్పాటు చేసినట్లు వివరించారు.

# స్టేట్ బ్యాంక్ మేనేజర్ వెకిలి చేష్టలు

☞ **నిలదీసిన ఓ వెలుగు సీఎఫ్ భర్త, కుమార్తె**

**సంతబొమ్మాళి, ఫిబ్రవరి1 (వార్త):** అవసరాన్ని ఆసరాగా చేసుకుని తన వద్దకు వచ్చే మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్న నౌపడ ఎస్‌బీఐ మేనేజర్ వెకిలి చేష్టలు వెలుగులోకి వచ్చాయి. వివరాల్లోకి వెళితే శుక్రవారం ఉదయం నౌపడ స్టేట్ బ్యాంకులో అధిక సంఖ్యలో వచ్చిన ఖాతాదారులతో బ్యాంకు సిబ్బంది తమతమ పనుల్లో బిజీగా ఉన్నారు. ఒక్కసారిగా బ్యాంక్ మేనేజర్ క్యాబిన్‌లో అరుపులు, కేకలు వినిపించాయి. బ్యాంకులో ఉన్న ఖాతాదారులకు, ఇతర బ్యాంకు సిబ్బందికి ఏమైందనేది కొద్దిసేపటి వరకు అర్థం కాలేదు. ఓ వెలుగు సీఎఫ్ భర్త, ఆమె కుమార్తె కలిసి బ్యాంక్ మేనేజర్‌ను నిలదీయడం కనిపించింది. ఎంతమంది సిఎఫ్‌ల జీవితాలతో ఆడుకుంటావు, సెల్ ఫోన్‌లో చాటింగులు చేస్తున్నావేంటి అంటూ ప్రశ్నించారు. మరోపక్క నువ్వు మా అమ్మతో ఇలాంటి పనులు చేయడం వల్ల నా భవిష్యత్తు ఏమవుతుందో అర్థం కావడం లేదు అంటూ సీఎఫ్ కుమార్తె బ్యాంకు మేనేజర్‌ను గట్టిగా నిలదీసింది. ఈ గొడవ జరుగుతున్న సమయంలో బ్యాంకు పనిమీద పోలీస్ కానిస్టేబుల్ రావడంతో జరిగిన విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. బ్యాంకు పని వేళల్లో ఇలాంటి గొడవలు చేయడం వల్ల ఖాతాదారులకు, బ్యాంకు సిబ్బందికి ఇబ్బంది కలుగుతుందని, ఏమైనా సమస్య ఉంటే పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేసుకోవాలని నచ్చజెప్పి సీఎఫ్ భర్తను, కుమార్తెను బయటికి పంపించివేశారు.




# వైసీపీ బలోపేతానికి సమష్టిగా కృషి చేద్దాం



☞ **టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జీ పేరాడ తిలక్**

☞ **నియోజకవర్గస్థాయి కమిటీ అధ్యక్షులకు అభినందన**

**టెక్కలి, ఫిబ్రవరి 1(వార్త):** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసేందుకు గాను గ్రామస్థాయి నుంచి పార్టీ అభివృద్ధికి అందరూ కలిసికట్టుగా పాటుపడాలని ఆ పార్టీ టెక్కలి నియోజకవర్గం ఇంచార్జ్ పేరాడ తిలక్ కోరారు. శనివారం టెక్కలి పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో నియోజకవర్గస్థాయిలో నియమితులైన 26 కమిటీల అధ్యక్షులను తిలక్ అభినందించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో తిలక్ మాట్లాడుతూ పార్టీ పదవులను బాధ్యతతో స్వీకరించి పార్టీ పటిష్టతకు, ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డిని గెలిపించుకునేందుకు, కార్యకర్తలకు అండగా ఉండేందుకు పాటుపడాలని కోరారు. రాష్ట్రస్థాయి, జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి అనుబంధ విభాగాల్లో ఇంకా పలువురు నాయకులకు నియమించడం జరుగుతుందని అందరం కలిసికట్టుగా పార్టీని ముందుకు తీసుకువెళదామన్నారు. కార్యక్రమంలో కోటబొమ్మాళి జడ్పీటీసీ సభ్యులు దుబ్బ వెంకటరావు, నందిగాం ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి కురమాన బాలకృష్ణారావు, సంపతిరావు హేమసుందర రాజు, గణపతిరావు, మడపాల సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

# అడ్డొస్తున్నాడని.. చంపేశారు

**ఆమదాలవలస, ఫిబ్రవరి 1 (వార్త):** అక్రమ సంబంధానికి అడ్డువస్తున్నాడని భర్తనే భార్య కొందరితో కలిసి హత్య చేయించిన ఘటన ఆమదాలవలస మండలంలో వెలుగుచూసింది. గత నెల 25న బొబ్బిలిపేట గ్రామ సమీపంలో జరిగిన హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఈ వివరాలను ఆమదాలవలస సర్కిల్ కార్యాలయంలో శనివారం మీడియా సమావేశంలో శ్రీకాకుళం డీఎస్పీ వివేకానంద వెల్లడించారు. బొబ్బిలిపేటకి చెందిన గరుగుబిల్లి చంద్రయ్య గత నెల 25వ తేదీ రాత్రి గ్రామ సమీపంలోని చెరువు వద్ద హత్యకు గురయ్యాడు. ఈ కేసులో పది మంది ప్రమేయం ఉన్నట్టు పోలీసు విచా రణలో గుర్తించారు. చంద్రయ్య భార్య ఈశ్వరమ్మకు అదే గ్రామానికి చెందిన చింతాడ బాలమురళీకృష్ణతో గత కొన్నాళ్లుగా వివాహేతర సంబం ధం ఉంది. ఈ విషయం తెలుసుకున్న చంద్రయ్య భార్యను మంద లించాడు. ఆమె సెల్‌ఫోన్ వాడకుండా కట్టుదిట్టం చేశాడు. అలాగే, బాల మురళీకృష్ణతో ఉన్న ఆర్థిక లావాదేవీలను కూడా నిలుపుదల చేశాడు. ఈ క్రమంలో ఈశ్వరమ్మ వేరే ఫోన్‌తో రహస్యంగా బాలమురళీకృష్ణతో సంభాషణలు కొనసాగిస్తుండేది. ఈ నేపథ్యంలో తమకు అడ్డంకిగా ఉన్న చంద్రయ్యను తొలగించుకోవాలని నిర్ణయించు కున్న బాలమురళీకృష్ణ.. తన సోదరుడైన ఇదే మండలం శ్రీనివాసచార్యులపేటలో నివాసం ఉంటు న్న గురుగుబిల్లి అరవింద్‌కు విషయం చెప్పాడు. చంద్రయ్యను హత మార్చడానికి సహకరించాలని కోరాడు. దీంతో బూర్జ మండలం ఉప్పిని వలస గ్రామానికి చెందిన గొల్లపల్లి వంశీ, సవలాపురం గణేష్‌లను బాల మురళీకృష్ణకు అరవింద్ పరిచయం చేశాడు. వీరందరూ కలిసి చంద్ర య్యను హతమార్చేందుకు మరి కొందరి సాయంతో పథకం రచిం చారు. దీంతో స్థానిక ఓ దాబాలో పూటుగా మద్యం తాగారు. బొబ్బిలిపేట సమీపంలోని చెరువు వద్ద రెండుసార్లు మాటువేసినా పథకం విజయ వంతం కాలేదు. దీంతో గత నెల 25వ తేదీ రాత్రి తన కుమార్తెను ఆమ దాలవలస బ్రిడ్జి నుంచి తీసుకువచ్చేందుకు చంద్రయ్య ఇంటి వద్ద స్కూటీపై బయలుదేరాడు. ఈ విషయాన్ని భార్య ఈశ్వరమ్మ అప్పటికే చెరువు వద్ద మాటు వేసి ఉన్న బాలమురళీకృష్ణకు ఫోన్ చేసి చెప్పింది. ఈ క్రమంలో స్కూటీపై వస్తున్న చంద్ర య్యను అటకాయించి బీరు సీసాతో బలంగా తలపై కొట్టారు. దీంతో వాహనం అదుపు తప్పి చంద్ర య్య కింద పడిపోయాడు. ఇదే అదునుగా బీరుసీసాలు, కర్రలతో విచక్షణా రహితంగా దాడి చేయడంతో ఆయన మృతి చెందాడు. అనంతరం మృతదేహం పీకకు కవరును బిగించి రోడ్డుపై ఈడ్చుకుంటూ చెరువులోని తుప్పల మాటున పడేసి వెళ్లిపోయారు. భార్య ఈశ్వరమ్మ ఏమీ ఎరగనట్టు తన భర్త కనిపించడం లేదని అదేరోజు పోలీసులకు ఫిర్యాదు చేసింది. మళ్లీ అర్ధరాత్రి సమయంలో చెరువు వద్ద పొదల్లో తన భర్త మృతదేహం ఉన్నట్టు సమాచారం అందించింది. దీంతో వెంటనే ఆమదాలవలస సీఐ పి.సత్యనారాయణ, ఎస్ఐ ఎస్.బాలరాజు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మరుసటి రోజు ఉదయం క్లూస్ టీమ్‌ను రప్పించి ఆధారాలు సేకరించారు. అనంతరం తమదైన శైలిలో పోలీసులు విచారణ చేపట్టడంతో హత్యకు గల కారణాలు బయటపడ్డాయి. ఈ కేసులో ప్రధాన నిందితుడు చింతాడ బాలమురళీ కృష్ణతో పాటు వంశీ, గణేష్, చంద్రయ్య భార్య ఈశ్వరమ్మ, సవలాపురం ప్రవీణ్, బొమ్మాళి శ్రీవర్ధన్, బొమ్మాళి ఉమామహేశ్వరరావు, యరల్లంకి కృష్ణ, గురుగుబెల్లి అరవింద్‌తోపాటు ఓ మైనరును అరెస్టు చేసి స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరుపర్చారు. వారికి రిమాండ్ విధించినట్టు డీఎస్పీ తెలిపారు.




జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## హెలికాప్టర్‌లో ప్రయాణ టికెట్ ధర రూ.1800

రథసప్తమి వేడుకల సందర్భంగా ఈ నెల 2వ తేదీ నుంచి 4వ తేదీ వరకు శ్రీకాకుళం నగరంలోని డచ్ భవనం ప్రాంగణంలో హెలికాప్టర్ ద్వారా విహరించే అవకాశాన్ని ప్రభుత్వ యంత్రాంగం ఏర్పాటు చేసింది. ప్రతి ట్రిప్పుకు విహరించే కాలం ఐదు నిమిషాలుగా నిర్ణయిం చారు. ఒక్కొక్కరికి టికెట్ ధర రూ.1800లు. 2 సంవత్సరాల లోపు పిల్లలకు ప్రవేశం లేదు. హెలికాప్టర్ రైడ్ టికెట్స్ ఆన్ లైన్ ద్వారా మాత్రమే బుక్ చేసుకోవాలి. ఆన్ లైన్ ద్వారా టికెట్స్ పొందడం తెలియని ప్రజల కోసం శ్రీకాకుళం మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్‌ని ఏర్పాటు చేయడమైనది. సిబ్బంది ఆన్ లైన్ లో టికెట్స్ ఎలా పొందాలో మీకు తెలియజేసి మీ తరపున టికెట్ బుక్ చేసి, టికెట్ కాపీని మీకు అందిస్తారు. టికెట్స్ కేవలం ఆన్ లైన్ పేమెంట్ ద్వారా మాత్రమే బుక్ చేసుకోవాలి. నగదు చెల్లింపులు ఎక్కడా అనుమతించబడవు. హెలికాప్టర్ రైడ్ బుక్ చేసుకున్న తేది, సమయానికి అనుగుణంగా ఫిబ్రవరి 2, 3, 4 తేదీలలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల మధ్య ఉంటుంది. హెలికాప్టర్ ద్వారా విహరించే అవ కాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని యంత్రాంగం ఒక ప్రకటనలో కోరింది. టికెట్ల బుకింగ్ కోసం heliride.arasavallisungod.org వెబ్సైట్‌ను సందర్శించాలని సూచించింది.

# నేటి నుంచి... రథసప్తమి వేడుకలు







శ్రీకాకుళం, ఫిబ్రవరి1(వార్త): అరసవల్లి సూర్యనారా యణ స్వామి జయంతి వేడుకలు రథసప్తమి సందర్భంగా మూడు రోజుల పాటు కన్నుల పండుగగా జరగనున్నాయి. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. తొలిరోజు ఆదివారం ఉదయం 6 గంటలకు సామూహిక సూర్య నమ స్కారాలతో ఉత్సవాలకు శ్రీకారం చుట్టనున్నారు. తొలిసారిగా హెలికాప్టర్ టూరిజం అందుబాటులోకి తెచ్చారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు డచ్ బిల్డింగ్, కలెక్టర్ కార్యాలయం దగ్గర హెలికాప్టర్ రైడ్ ఉంటుంది. గ్రామీణ క్రీడా పోటీలు ఉదయం 10 గంటలకు ఎన్.టి.ఆర్. మున్సిపల్ గ్రౌండ్స్‌లో ప్రారంభం కానుంది. వాలీబాల్, వెయిట్ లిఫ్టింగ్, కర్రసాము, సంగిడీలు, ఉలవల బస్తా లిఫ్టింగ్, పిల్లిమొగ్గలు వంటి పోటీలు నిర్వహిస్తారు. విజేతలకు నగదు బహుమతులు అందజేస్తారు.

### శోభాయమానంగా శోభాయాత్ర..

శోభాయాత్ర మధ్యాహ్నం 2.30 గంటలకు డే అండ్ నైట్ జంక్షన్ నుంచి అరసవల్లి ప్రధాన ఆలయం వరకు నిర్వహిస్తారు. సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ఆర్ట్స్ కళాశాల మైదానంలో సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి. ఆరోహి స్కూల్ ఆఫ్ మ్యూజిక్, దుంపల ఈశ్వర్ బృందం, యామినీ కృష్ణ బృందం, పరిమళ బృందం, అనురాధ బృందం, లక్ష్మీగణపతి శర్మ బృందం తమ ప్రదర్శనలతో ప్రేక్షకులను అలరించనున్నారు. హైపర్ ఆది, ఫైమా, ఢీ భూమిక, రేలారే రేలా టీమ్, మిమిక్రీ ఆనంద్, జోష్ శివ, పిన్నీ సాంగ్ ఫేమ్ షన్ముఖ, సురేష్ రేష్మ, బాలాజీ వంటి ప్రముఖులు ధూంధాం కార్యక్రమంలో పాల్గొంటారు.

### ప్రత్యేక ఆకర్షణ కానున్న లేజర్ షో..

రాత్రి 7 గంటలకు నుంచి 8 గంటలకు వరకూ గంటపాటు ఆహుతు లను అలరించేలా లేజర్ షో ఏర్పాటు చేశారు. రాత్రి 9 గంటల నుంచి శ్రీ అంజనా కళా సంస్థ సమర్పించు ఆంధ్రరాష్ట్రంలో పేరుపొందిన నటీ నటులతో పంచరత్నాలు పౌరాణిక నాటకాలు ప్రదర్శిస్తారు. మయసభ పడక సీను, శ్రీరామాంజనేయ యుద్ధం, భక్త చింతామణి, గయోపాఖ్యానం, శ్రీ సత్యహరిశ్చంద్ర వారణాశి నుండి ప్రారంభం వంటి నాటకాలను ప్రదర్శిస్తారు.

### కోడి రామ్మూర్తి స్టేడియంలో పార్కింగ్..

ఆర్ట్స్ కళాశాల మైదానం లోనే ఫుడ్ కోర్టులు అందుబాటులో ఉంచారు. ప్రముఖ హెూటల్స్, స్థానిక హెూటళ్ల తో కలిపి అందుబాటు ధరలోనే ఆహార పదార్థాలు లభించేలా చర్యలు తీసుకుంటున్నారు. కోడి రామ్మూర్తి స్టేడియంలో పార్కింగ్, మరుగుదొడ్ల సౌకర్యాన్ని కల్పించారు. ఈ వేడుకలకు రాష్ట్రం నలుమూలల నుండి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వస్తారని అంచనా వేస్తున్నారు.

### రథసప్తమి ఏర్పాట్ల పరిశీలన

రథసప్తమి రాష్ట్ర వేడుకల ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ శనివారం పరిశీలించారు. సూర్య నమస్కారాలు నిర్వహించబోయే 80 అడుగుల రోడ్డు వద్ద ఏర్పాట్లు, అక్కడే పార్కింగ్ ఏర్పాట్లపై జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డీఎస్పీ సీహెచ్ వివేకానందతో చర్చించారు. నగరంలో మిల్లు జంక్షన్, పాలకొండ రోడ్డులో జరుగుతున్న బ్యూటిఫికేషన్ పనులను పరిశీలించారు. ఆర్ట్స్ కళాశాల మైదానంలో జరుగనున్న సాంస్కృతిక కార్యక్రమాలు, స్టాల్స్ ఏర్పాట్లపై ఆరా తీశారు. ఆయన వెంట రెవెన్యూ డివిజనల్ అధికారులు కె. సాయి ప్రత్యూష, ఎం.కృష్ణమూర్తి, జిల్లా అధికారులు నగేష్, శ్రీనివాసరావు, త్రినాధ స్వామి, సంప్రదాయం డైరెక్టర్ స్వాతి సోమనాథ్, తదితరులు పాల్గొన్నారు.

**☞ సూర్య నమస్కారాలతో శ్రీకారం ☞ తొలి రోజు ఉదయం 6 నుంచి రాత్రి 10 వరకు కార్యక్రమాలు ☞ ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఏర్పాట్లు ☞ ఆకర్షణగా హెలికాప్టర్ టూరిజం, లేజర్ షో ☞ రాత్రి 6.30 గంటలకు హైపర్ ఆది స్కిట్ ☞ మధ్యాహ్నం డే అండ్ నైట్ నుంచి అరసవల్లి వరకూ శోభాయాత్ర ☞ మున్సిపల్ మైదానంలో రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు**

### నేటి నుంచి టికెట్ల విక్రయాలు

అరసవల్లి సూర్యనారాయణ స్వామి రథసప్తమి సందర్భంగా ఈనెల మూడవ తేదీ అర్ధరాత్రి నుంచి స్వామి వారి నిజరూప దర్శనం కనుల విందు చేయనుంది. ఈ సందర్భంగా భక్తుల సౌకర్యార్థం, రద్దీని క్రమబద్ధీకరించే చర్యలలో భాగంగా వివిధ రకాల టికెట్లను అందుబాటులో ఉంచామని జిల్లా రెవిన్యూ అధికారి తెలిపారు. రూ. 100, రూ.300, రూ.500 దర్శన టికెట్లు అరసవల్లి దేవాలయ ప్రాంగణంలోని కౌంటర్లో లభిస్తాయి. 4వ తేదీ ఉదయం ఒంటిగంట నుంచి ఉదయం ఆరు గంటల వరకు టిక్కెట్లు విక్రయించనున్నారు.










Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546